
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

మంగళవారం 2 జనవరి 2024

రాష్ట్రంలో మార్పు అవసరం

- ఈ నాలుగున్నరేళ్లలో ఎక్కడా అభివృద్ధి లేదు
- ప్రజలు ఈ ఏడాది రాష్ట్రాన్ని కాపాడుకోవాలి
- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ
- అప్పులు, అభివృద్ధిపై వైపీసీ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

- మెయిన్‌లో



కొణతాల రామకృష్ణ



ముంచంగిపుట్టు దీక్షా శిబిరంలో న్యూఇయర్ కేక్ కట్ చేస్తున్న అంగన్‌వాడీలు

అలుపెరగని పోరు

21వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె.. సమగ్ర శిక్ష ఉద్యోగులది 13వ రోజు

సర్కారు తీరుపై ఆగ్రహం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

కొత్త ఏడాది ప్రారంభం రోజున అందరూ శుభాకాంక్షలు తెలుపుకొంటూ ఆనందంగా గడుపుతుంటే.. తమకు మాత్రం కష్టాలు తప్పడం లేదని అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు నూతన సంవత్సర వేడుకల సందడిలో ఉంటే, తాము మాత్రం సమ్మె చేపడుతూ, నిరసన శిబిరాల్లోనే ఉండాల్సిన దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని వారు మండిపడుతున్నారు. నూతన సంవత్సరం తొలి రోజు సోమవారం సైతం అంగన్‌వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ ఆందోళనలను కొనసాగించారు. సోమవారానికి అంగన్‌వాడీల సమ్మెకు 21వ రోజు కాగా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 13వ రోజుకు చేరింది. పాడేరులో అంగన్‌వాడీలు ఆందోళన కొనసాగిస్తున్నారు. సోమవారం నూతన సంవత్సర తొలి రోజు కావడంతో దీక్షా శిబిరంలోనే కేక్ కట్ చేసి చిన్నారులకు పంచారు. వీరి సమ్మెకు టీడీపీ నాయకుడు కేవీ రమేశ్‌నాయుడు మద్దతు తెలిపారు. చింతపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న సమ్మెకు గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు బొడు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగులలో అంగన్‌వాడీల సమ్మెకు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన పడాల్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు మద్దతు తెలిపారు. కొయ్యూరులోని దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు వినూత్న నిరసన తెలిపారు. కబడ్డీ ఆడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముంచంగిపుట్టులోని దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు న్యూ ఇయర్ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. థింసా నృత్యంతో పాటు ఆటపాటలతో తమ నిరసనను వ్యక్తం చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు

పాడేరు ఐటీడీఏ కార్యాలయం ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న నిరసన శిబిరాన్ని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ సందర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే పలు చోట్ల సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆందోళన కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళనను విరమించబోమని ఆందోళనకారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.



పాడేరులో సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

న్యూ ఇయర్ సందడి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

జిల్లాలో సోమవారం నూతన సంవత్సర సందడి కనిపించింది. కలెక్టరేట్, ఐటీడీఏ, సబ్ కలెక్టర్, ఇతర జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, సబ్‌కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వివిధ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్ అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

-వార్త 8వ పేజీలో..



సోమవారం మధ్యాహ్నం పన్నేడా వద్ద మరమ్మతులకు గురై ఆగిపోయిన ముంచంగిపుట్టు-పాడేరు బస్సు

డొక్కు బస్సుతో నరకయాతన

మరమ్మతులకు గురై పన్నేడా వద్ద ఆగిపోయిన ముంచంగిపుట్టు- పాడేరు బస్సు

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

గంటల కొద్దీ పడిగాపులు

వేరే బస్సులో పాడేరు తరలింపు

వారపు సంత కావడంతో స్తంభించిన ట్రాఫిక్

పెదబయలు, జనవరి 1: జిల్లాలో ప్రజా రవాణా శాఖ (పీటీడీ) డొక్కు బస్సులను నడుపుతుండడంతో తరచూ అవి ఎక్కడబడితే అక్కడ ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మన్యం వాసులంటే రాష్ట్ర ప్రభుత్వానికి చిన్నచూపు అని, అందుకే కాలం చెల్లిన బస్సులను నడుపుతోందని గిరిజనులు మండిపడుతున్నారు.

పాడేరు- ముంచంగిపుట్టు ట్రిపుల్ సర్వీసు బస్సు సోమవారం మధ్యాహ్నం ముంచంగిపుట్టులో బయలుదేరి పెదబయలు సమీపంలో పన్నేడా గ్రామం వద్దకు వచ్చే సరికి ఆగిపోయింది. బస్సు ముందు భాగంలో ఉండే స్టీరింగ్ జాయింట్ ప్రధాన కట్ట(ప్లేట్) విరిగిపోవడంతో బస్సు అదుపుతప్పి లోయలోకి వెళ్లే క్రమంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి సురక్షితంగా రోడ్డుపై నిలిపాడు. ఆ సయయంలో బస్సులో సుమారు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ సంఘటనతో ప్రయాణికులు భయాందోళన చెందారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం కండీషన్‌లో లేని బస్సులను నడుపుతూ ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని అసహనం వ్యక్తం చేశారు. డొక్కు బస్సులను నడపడంతో తమ ప్రయాణాలు సాఫీగా సాగడం లేదని, బస్సులు ఆగిపోవడంతో నడి రోడ్డుపై పడిగాపులు కాయవలసి వస్తోందని వాపోయారు.

ఈ బస్సు ఆగిపోవడం వల్ల వేరే బస్సు పెదగూడకు పంపించకపోవడంతో మధ్యాహ్నం సర్వీసు లేక సంతకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే పెదగూడ ప్రాంతంలో వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు బస్సు లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. కొంత సమయం గడిచాక ప్రయాణికులను వేరే బస్సులో పాడేరు పంపారు. పాడేరు డిపో నుంచి జోలాపుట్, బొంగరం, కుమడ వెళ్లే బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. కాగా రోడ్డుపై బస్సు నిలిచిపోవడం, సోమవారం వారపు సంత కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. సాయంత్రం సమయంలో అర్ధగంట సేపు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.



వీసీ అంటే అంత చులకనా!?

ఏయూలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్

ఇప్పటివరకూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమతకు సమాచారం ఇవ్వని అధికారులు

ఆ నోట..ఈనోట సమాచారం తెలుసుకుని సీరియస్ అయిన ఉప కులపతి

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్ జరగబోతోంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అయితే, ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించిన సమాచారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమతకు ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.

గడిచిన నెల రోజుల నుంచి అధికారులు ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రిజిస్ట్రార్‌తోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయమోహన్ పర్యవేక్షిస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో ఫెస్టివల్ ప్రారంభం కానుంది. కానీ, ఈ విషయాన్ని ఇప్పటివరకూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమతకు తెలియజేయలేదు. ఆనోట, ఈ నోటా వర్సిటీలో నిర్వహిస్తున్న ఫెస్టివల్ గురించి తెలుసు కున్న వీసీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయ్‌మోహన్‌ను పిలిచి ప్రశ్నించినట్టు తెలిసింది. వీసీగా ఉన్న తనకే యూత్ ఫెస్టివల్ గురించి తెలియకపోతే ఎలాగని నిలదీసినట్టు సమాచారం. వర్సిటీలో కీలక స్థానంలో ఉన్న తనకు తెలియకుండా ఎవరి ఆదేశాలతో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారని ఆమె ఆగ్రహాన్ని వ్యక్తంచేసినట్టు చెబు తున్నారు. ఎవరెవరికో కాకుండా ఏదైనా ఉంటే నేరుగా తనకే చెప్పాలని ఆమె సూచించినట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై వర్సిటీలో జోరుగా చర్చ సాగుతోంది.

ఇన్‌చార్జి వీసీని పట్టించుకోని పలువురు అధికారులు

వర్సిటీలో కొంతమంది అధికారులు, సీనియర్ ప్రొఫెసర్లు ఏ విషయాన్నీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమత దృష్టికి తీసుకువెళ్లడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికీ కొంతమంది తాజా మాజీ వీసీ నుంచే సలహాలు, సూచనలు స్వీకరిస్తుంటారని చెబుతున్నారు. ఓ అధికారి సూచనతోనే ఇన్‌చార్జి వీసీ పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తు న్నారన్న ఆరోపణలు క్యాంపస్‌లో ఉన్నాయి. దీనిపై ప్రస్తుత ఇన్‌చార్జి వీసీ కూడా సీరియస్‌గానే ఉన్నట్టు చెబుతున్నారు. తనకు తెలియకుండా ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా ఊరుకునే ప్రసక్తే లేదని పలువురు అధికారులకు ఇప్పటికే ఆమె గట్టిగా చెబుతున్నారు. ఇకపోతే, ఫెస్టివల్ నిర్వహణను పరిశీలించేందుకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నుంచి రెండు రోజుల్లో పరిశీలకుడు రానున్నారు.

ఫెస్టివల్‌కు 1,000 మంది విద్యార్థులు

బీచ్‌రోడ్డులోని ఏయూ కాన్వొకేషన్ హాలులో నిర్వహించనున్న సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఏపీ, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి వంటి రాష్ట్రాల నుంచి సుమారు వేయి మంది విద్యార్థులు హాజరవుతున్నారు. థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, డ్యాన్స్, లిటరరీ వంటి అంశాలకు సంబంధించిన ప్రదర్శనలు ఉంటాయి. ఫెస్టివల్‌కు హాజరవుతున్న విద్యార్థులు ఉండేందుకు అనుగుణంగా వర్సిటీలోని హాస్టళ్లను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం విద్యార్థులు ముందుగానే సంక్రాంతి సెలవులు ఇవ్వనున్నట్టు చెబుతున్నారు.

మంచు ముసుగులో మన్యం

కొనసాగుతున్న చలి తీవ్రత

చింతపల్లిలో 15, పాడేరులో 15.3, అరకులోయలో 15.9 డిగ్రీలు

పాడేరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పటికీ గత కొన్ని రోజులుగా చలి తీవ్రత కొనసాగుతున్నది. దీంతో మన్యం వాసులు వణుకుతున్నారు. చింతపల్లిలో 15, పాడేరులో 15.3, అరకులోయలో 15.9 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు సోమవారం నమోదయ్యాయి. శీతాకాలం నేపథ్యంలో మరి కొన్ని రోజులు ఇదే వాతావరణం కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ సూచిస్తున్నది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పాటు ఉత్తరాది నుంచి చలిగాలులు సైతం వీస్తుండడంతో చలి కొనసాగుతున్నది. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టంగా పొగ మంచు కమ్మేస్తుంది. దీంతో రోడ్డు మార్గం సరిగా కనిపించక హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి కొనసాగుతున్నది. అలాగే మధ్యాహ్నం వేళలో ఒక మోస్తరుగా ఎండ కాస్తున్నది. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి ప్రభావం చూపుతున్నది.



ముంచంగిపుట్టులో సోమవారం ఉదయం 9 గంటల సమయంలో కురుస్తున్న మంచు

చింతపల్లిలో..


చింతపల్లి: మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. సోమవారం చింతపల్లిలో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల కిందట వరకు ఏజెన్సీ వ్యాప్తంగా పది కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినప్పటికి చలిలో ఎటువంటి మార్పు లేదు. చలి తీవ్రత గిరిజన గ్రామాల్లో అధికంగా ఉన్నది. దీనికి తోడు మంచు దట్టంగా కురుస్తున్నది. చింతపల్లి, జీకేవీధి, చింతపల్లి, తాజంగి గ్రామాల్లో ఉదయం పదిన్నర గంటల వరకు మంచు వీడడం లేదు. చలి కారణంగా ప్రాంతీయ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



పాడేరులో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు దట్టంగా పొగమంచు

ముంచంగిపుట్టులో..

ముంచంగిపుట్టు: మండల పరిధిలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. దట్టంగా మంచు కమ్ముకొంటోంది. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి తీవ్రత కొనసాగుతోంది.



తారాబు జలపాతం వద్ద పర్యాటకులు

తారాబు జలపాత సౌందర్యం

ఎత్తైన గిరుల పైనుంచి పాల నురగలా జలపాత సోయగాన్ని చూసేందుకు పర్యాటకులు సోమవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సరిహద్దు ప్రాంతంలో గల గిన్నెలకోట పంచాయతీ పరిధిలోని తారాబు సమీపంలో ప్రవహిస్తున్న ఈ జలపాతం వద్ద కొత్త సంవత్సరం సందర్భంగా సందడి నెలకొంది. న్యూ ఇయర్ వేడుకలను జలపాతం వద్ద చేసుకునేందుకు ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల నుంచి పర్యాటకులు వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

-ముంచంగిపుట్టు

చెరువులవేనం కిటకిట

పోటెత్తిన పర్యాటకులు

ఆంధ్ర కశ్మీర్ లంబసింగికి పర్యాటకులు పోటెత్తారు. లంబసింగిలో ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సోమవారం భారీ సంఖ్యలో పర్యాటకులు తరలి వచ్చారు. అత్యధిక సంఖ్యలో పర్యాటకులు ఆదివారం రాత్రికే లంబసింగి చేరుకుని స్థానికంగా బస చేశారు. దీంతో లంబసింగిలో ఉదయం ఐదు గంటల నుంచే పర్యాటకుల సందడి కనిపించింది. చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద జాతర వాతావరణం నెలకొన్నది. సాయంత్రం వరకు లంబసింగి పరిసర పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో రద్దీగా కనిపించాయి.

- చింతపల్లి



చెరువులవేనం వద్ద పర్యాటకులు

క్రైం... crime news

వీఆర్‌వో ఆత్మహత్య


ప్రసాద్ (ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, జనవరి 1: మండలంలో శెట్టిపాలెం సచివాలయం వీఆర్‌వోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నారు. నర్సీపట్నం టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బొడ్డేపల్లికి చెందిన ప్రసాద్(35) వీఆర్‌వోగా పని చేస్తున్నారు. ఆయన ఆదివారం మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మధ్యాహ్నం వరకు పని చేశారు. ఆయనతో పాటు అతని భార్య కూడా కార్యాలయానికి వచ్చింది. ఆ తరువాత మాకవరపాలెం బస్టాండ్‌లో ఆమెను విశాఖపట్నం వెళ్లే బస్సు ఎక్కించి అతను బొడ్డేపల్లిలోని ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి 7 గంటల సమయంలో తన భార్య ఫోన్‌కు మెసేజ్ పంపాడు. తిరిగి ఆమె అతని సెల్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి పక్క ఇంట్లో ఉంటున్న వారికి ఫోన్ చేసి తమ ఇంటికి వెళ్లి చూడమని చెప్పింది. వారు గది తలుపులు బద్దలుగొట్టి లోపలికి వెళ్లగా ప్రసాద్ ఉరివేసుకుని విగతజీవిగా ఉన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో వారు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నర్సీపట్నం టౌన్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

వ్యాన్ ఢీకొని ఆశ కార్యకర్త మృతి

- మరో ఇద్దరు ఆశలు, ఆటో డ్రైవర్‌కు గాయాలు


డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు


అమ్మాజీ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, జనవరి 1: తుమ్మపాల మెయిన్ రోడ్డు చర్చి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆశ కార్యకర్త మృతిచెందగా మరో ఇద్దరు కార్యకర్తలు గాయపడ్డారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మపాల అంబేడ్కర్ కాలనీకి చెందిన ఆశ కార్యకర్త తోటాడ అమ్మాజీ(58) వైద్య సేవల నిమిత్తం సోమవారం ఉదయం తుమ్మపాల పీహెచ్‌సీకి వెళ్లింది. అనంతరం సహచర ఆశ కార్యకర్తలు మద్దాల ప్రమీల, పీలా మంగలతో కలిసి తిరిగి ఇంటికి వస్తున్నది. ఈ సమయంలో చోడవరం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న వ్యాన్‌ను, ఆగి ఉన్న ఆటోను ఢీకొనడంతో పాటు ఎదురుగా నడుచుకుంటూ వస్తున్న అమ్మాజీ, ప్రమీల, మంగలను ఢీకొన్నది. దీంతో అమ్మాజీ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మిగిలిన ఇద్దరితోపాటు ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా ఆటోను, మహిళలను ఢీకొన్న వ్యాన్‌ను డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానిక యువకులు వెంటనే బైక్‌లపై వెళ్లి విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆశ కార్యకర్త తోటాడ అమ్మాజీ కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.శాంతి, ప్రధాన కార్యదర్శి ఇ.పార్వతి, కోశాధికారి సూర్యకళ, సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో, బైక్

నర్సీపట్నం అర్బన్, జనవరి 1: మండలంలోని చెట్టుపల్లి గ్రామ సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చెట్టుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి నర్సీపట్నం నుంచి రోలుగుంట వైపు వెళుతున్న ఆటో, రావికమతం నుంచి నర్సీపట్నం వెళుతున్న బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో నర్సీపట్నం మండలం ఓఎల్ పురం గ్రామానికి చెందిన నీలపు అప్పలనాయుడు(67) తీవ్రంగా గాయపడగా, కేజీహెచ్‌కి తరలిస్తే అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. నల్ల కొండబాబు, ఈదల సత్యవతికి గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

నేక్ ద్వారా ఎలక్ట్రీషియన్‌కు ఉచిత శిక్షణ

అనకాపల్లి రూరల్, జనవరి 1: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ఎలక్ట్రిక్, ప్లంబింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఏడీ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై 15 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. సుమారు రెండు నెలలపాటు శిక్షణ ఉంటుందని, మరిన్ని వివరాల కోసం 7780275922కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

వీధుల్లో క్షీణించిన పారిశుధ్యం

- పారిశుధ్య కార్మికుల సమ్మెతో 'పట్నంలో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- పూడుకుపోయిన డ్రైనేజీలు
- పెరిగిన దోమల బెడద


వెంకునాయుడుపేటలో పేరుకుపోయిన చెత్త



నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం, జనవరి 1 : మునిసిల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె సోమవారం ఏడో రోజుకు చేరుకుంది. అన్ని వార్డుల్లో చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకు పోయింది. ప్రజారోగ్య అధికారుల అంచనా ప్రకారం అన్ని ప్రాంతాల్లో రోజుకు 30 టన్నుల చొప్పున గత ఏడు రోజుల్లో సుమారు 200 టన్నుల చెత్త పేరుకు పోయింది. డంపర్ బిన్నులన్నీ నిండిపోయి చెత్త రోడ్లు మీద చెల్లాచెదురుగా పడి అపారిశుధ్యం తాండవిస్తున్నది. హోటళ్లు, పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారులు చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్ల పక్కన పడేస్తున్నారు. డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద పెరిగి పోయింది. ఇళ్లలో చెత్త డబ్బాలు నిండి పోవడంతో జనం తప్పనిసరి పరిస్థితిల్లో వీధుల్లో పడేస్తున్నారు. ఇదిలావుండగా ప్రభుత్వం మనసు మారి, తమ డిమాండ్లను అంగీకరించేలా చూడాలంటూ కార్మికులు అబీద్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రిలే దీక్షలు చేపట్టారు.

వైకుంఠవాసునిగా ఉపమాక వెంకన్న

విశిష్ట అలంకరణలో దర్శించుకున్న భక్తులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


ఉభయదేవేరులతో వైకుంఠవాసునిగా భక్తులకు విశిష్ట దర్శనమిస్తున్న ఉపమాక వెంకన్న

నక్కపల్లి, జనవరి 1: ఉపమాక ఆలయంలో వేంకటేశ్వరస్వామి సోమవారం వైకుంఠవాసునిగా విశిష్ట అలంకరణలో దర్శనమిచ్చారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రాపత్తు అధ్యయనోత్సవాలు చివరి రోజైన సోమవారం ఆలయ ఆచార వ్యవహారాల ప్రకారం పరమపద ఉత్సవం నిర్వహించారు. ఈ సం దర్భంగా స్వామివారిని వైకుంఠ వాసునిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో పుణ్యకోటి వాహనంలో శేషపాన్పుపై ఉభయదేవేరులు ఇరుపక్కలా ఆశీనులవ్వగా, స్వామివారు వైకుంఠ వాసునిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామికి హారతులిచ్చారు. తదుపరి సప్పరం వాహనంపై అలంకరించి తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఆలయంలో రాపత్తు ఉత్సవాలు ముగిసినట్టు అర్చకులు ప్రకటించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి కోరారు. సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ ముద్రించిన డైరీ, క్యాలెండర్‌ను కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్, జేసీలకు యూటీఎఫ్ ప్రతినిధులు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు చినబ్బాయి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారుల సమస్యలు పరిష్కరించిన వారికే ఎన్నికల్లో మద్దతు'

పరవాడ, జనవరి 1 : మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం మత్స్యకారుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన నాయకులకే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతును ప్రకటిస్తామని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ముత్యాలమ్మపాలెం తీరంలోని గెస్ట్‌హౌస్‌లో మత్స్యకారుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఐదేళ్ల పాలనలో మత్స్యకార గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. మత్స్యకారులకు ఫార్మాసిటీలో ఉపాధి కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం, తంతడి సర్పంచులు చేపల మసేను, చోడిపల్లి దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతకాయల అమ్మోరు, సూరాడ పెంటయ్య, మైలపల్లి అప్పన్న, అర్జిల్లి ప్రకాష్, సూరాడ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అత్యాచారం కేసులో చురుగ్గా విచారణ

- పోలీసుల అదుపులో 11 మంది నిందితులు
- బాధితురాలికి చికిత్స

విశాఖపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలికపై సామూహిక అత్యాచారం కేసులో పోలీసులు ఇప్పటివరకూ 11 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. మరికొంతమంది కోసం గాలిస్తున్నారు. బాధిత బాలిక మానసిక ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఆమెకు చికిత్స చేయిస్తున్నారు. బాలిక కుటుంబానిది ఒడిశాలోని కలహండి జిల్లా కాగా ఉపాధి నిమిత్తం విశాఖపట్నం వచ్చి కంచరపాలెంలో నివాసం ఉంటోంది. ఆ బాలిక కూడా ఓ దగ్గర పనికి కుదిరింది. అక్కడ ఓ యువకుడు పరిచయమై ప్రేమ పేరుతో నమ్మించి గత నెల 17వ తేదీన హోటల్‌కు తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెను లోబరుచుకున్నాడు. అనంతరం తన మిత్రుడిని పిలిపించాడు. ఆమె బాధతో బీచ్‌కు వెళ్లగా, అక్కడ ఇంకో వ్యక్తి ఆశ్రయం ఇస్తానని చెప్పి తీసుకువెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తరువాత ఆమెపై చాలామంది అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తండ్రి గత నెల 18న నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు విచారణ చేపట్టి, ఆమె ఒడిశాలోని స్వస్థలంలో ఉందని గుర్తించి తీసుకువచ్చారు. తల్లిదండ్రుల సమక్షంలో విచారించగా, నగరంలో చాలా హోటళ్లకు తిప్పారని, అత్యాచారం చేశారని తెలిపింది. ఆమె చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు 11 మందిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో కొందరు ఆమెను ఒడిశా తీసుకువెళ్లినట్టు తెలిసింది. వారు ఒడిశాకు చెందిన వారా?, ఇక్కడివారా?...ఎక్కడ పరిచయం అయినవారో తెలుసుకోవడానికి పోలీసులు యత్నిస్తున్నారు. అలాగే ఆమె నగరంలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లకుండా, ఒడిశా ఎందుకు వెళ్లింది?, నిందితులు ఏ విధంగా మభ్యపెట్టారనే వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేసును దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

'న్యాయం జరిగే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరు'

కె.కోటపాడు, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన నిధులన్నీ తిరిగి గ్రామ పంచాయతీలకు, మండల, జిల్లా పరిషత్‌లకు జమ చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరు సాగిస్తూనే ఉంటామని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8,66 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకుందన్నారు.

మొక్కల పెంపకంతో ఆరోగ్యకర వాతావరణం

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


మొక్క నాటి, నీరు పోస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 1 : మొక్కల పెంపకం మానవాళి మనుగడతో ముడిపడి ఉందని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం అనకాపల్లి నుంచి గాజువాకకు వెళ్లే మార్గంలో జాతీయ రహదారి జలగలమదుం సమీపంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే మానవాళికి ప్రాణాధారమైన ఆక్సిజన్ వృద్ధి చెందుతుందని, తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. చెట్ల పెంపకం వద్ద బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీవో శిరీషారాణి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి మంజులావాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సరం వేడుకలు



ఎస్పీ మురళీకృష్ణతో పరవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులు

అనకాపల్లి రూరల్, జనవరి 1: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ సబ్ డివిజన్‌లలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు తరలివచ్చి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, ఏఎస్పీ విజయభాస్కర్‌లను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. డీటీసీ డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు వచ్చి పోలీస్ ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు చెప్పారు.



బాబు ష్యూరిటీ కరపత్రాలతో గిరిజనులు, నాయకులు

'వైసీపీ పాలనలో కానరాని గిరిజనాభివృద్ధి'

పాడేరు రూరల్, జనవరి 1: వైసీపీ నాలుగున్నరేళ్ల పాలనలో గిరిజనాభివృద్ధి ఎక్కడా కానరాలేదని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేవీ సురేష్‌కుమార్ అన్నారు. టీడీపీ నాయకులతో కలిసి గుత్తులపుట్టు పంచాయతీ పరిధిలోని జి.కొత్తూరు, వంతాలగుమ్మి, దబ్బాపుట్టు, సంతబయలు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ తొలి మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను గిరిజనులకు వివరించారు. అలాగే పలు కుటుంబాలను రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. టీడీపీ, జనసేన సంయుక్తంగా జరిపే ఎన్నికల పోరాటంలో జగన్ పాలనకు ప్రజలు చరమగీతం పాడక తప్పదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గిరిజనాభివృద్ధి లేకపోగా, గిరిజనుల హక్కులు, చట్టాలను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు బలపర్చిన అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుత్తులపుట్టు పంచాయతీ సర్పంచ్ సాగిన బాబూరావుపడాల్, టీడీపీ నాయకులు కేవీ.ప్రసాద్, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర సందడి

» ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, ఉద్యోగులు

» ప్రభుత్వ కార్యాలయాల్లో న్యూ ఇయర్ హడావుడి





కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దంపతులు... పీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సబ్ కలెక్టర్

పాడేరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం నూతన సంవత్సర సందడి నెలకొంది. కలెక్టరేట్, ఐటీడీఏ, సబ్ కలెక్టర్, జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో వేడుకల హడావుడి కనిపించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు, వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఐటీడీఏ పీవో క్యాంప్ కార్యాలయంలో పీవో అభిషేక్ కేక్ కట్ చేసి అధికారులకు, ఉద్యోగులకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నరసింగరావు, ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకరరావు, వెంకటేశ్వరరావు, ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పీవోకు పుష్పగుచ్ఛాలు అందించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే సబ్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డికి రెవెన్యూ, ఐటీడీఏలోని వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ విద్యా శాఖ ఉప సంచాలకుడు ఐ.కొండలరావు, డీపీఆర్వో గోవిందరావు, డీఎల్‌పీఆర్వో పి.రాములు, ఇతర జిల్లా అధికారుల కార్యాలయాల్లోనూ ఉద్యోగులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి గృహాల్లో సైతం నూతన సంవత్సర సందడి నెలకొంది. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వచ్చి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

గిడ్డి ఈశ్వరికి నాయకుల శుభాకాంక్షలు



గిడ్డి ఈశ్వరికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పాడేరు రూరల్: తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నివాస గృహంలో నూతన సంవత్సర సందడి నెలకొంది. టీడీపీ నాయకులు, అభిమానులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు, వర్తక వ్యాపార సంఘ ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు, పాస్టర్లు, బంధుమిత్రులు వందల సంఖ్యలో ఆమె గృహానికి వచ్చి సంప్రదాయంగా బొకేలు, పండ్లు, స్వీట్లు అందించి శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి నియోజకాభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధన్నేటిపలాసి సురేష్, డప్పోడి వెంకటరమణ, రాంబాబు, వెంకటేష్, అప్పన్న, జ్ఞాన ప్రకాష్, రీమాలి జాన్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, తదితరులు

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

పాడేరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్-2024 క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.జగన్మోహనరావు, ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం ముద్రించిన 2024 క్యాలెండర్‌ను ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, టీడబ్ల్యూ టీఏ నేతలు రేగం సూర్యనారాయణ, పి.కృష్ణారావు, కె.రామారావు, కె.నీలకంఠం, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల విడుదల



డుంబ్రిగుడలో యూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ/పెదబయలు: యూటీఎఫ్ క్యాలెండర్లను పలు మండలాల్లో సోమవారం ఆవిష్కరించారు. ముంచంగిపుట్టులో ఎంఈవో కె.కృష్ణమూర్తి చేతులు మీదుగా యూటీఎఫ్ డైరీ, క్యాలండర్ల ఆవిష్కరణ జరిగింది. యూనియన్ సభ్యులు ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే శారద నికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాల యాజమాన్యం ఎంఈవోకు పాఠశాలకు చెందిన క్యాలెండర్, డైరీలను అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.రాజు, ఎస్.గోపి, ఎం.ధర్మారావు, కూడా శ్రీనివాస మూర్తి, త్రినాథ్, ఈశ్వరమ్మ, దాసు, లక్ష్మీ , ఉపాధ్యాయులు సీహెచ్.మత్స్యరాజు, ఎస్.దొన్ను పాల్గొన్నారు. అలాగే డుంబ్రిగుడ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంపీడీవో ఉషారాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి పాటుపడాలని ఆకాంక్షించారు. ఎంఈవో సుందరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం సాగిస్తూ ఉద్యోగులకు అండగా నిలవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ, జిల్లా కౌన్సిలర్ కన్నయ్య, గౌవవాధ్యక్షుడు సుబ్బారావు, నాయకులు మోహన్, దుక్కు పాల్గొన్నారు. పెదబయలు మండల విద్యా శాఖ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ వరహాలమ్మ, ఎంఈవోలు క్రిష్ణమూర్తి, పుష్పవతి చేతుల మీదుగా యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, సతీష్, ఆనందరావు, మాధవరావు, కమల కుమారి తదితరులు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టులో క్యాలెండర్ల విడుదల

క్రీడా పోటీలతో ప్రతిభకు పదును

» టీడీపీ నాయకుడు ఎంవీవీ ప్రసాద్



విజేతలకు బహుమతులు అందిస్తున్న టీడీపీ నాయకులు

కొయ్యూరు, జనవరి 1: యువతలో వివిధ రూపాల్లో దాగివున్న ప్రతిభను పదును పెట్టేందుకు పోటీలు ఎంతగానో దోహదపడతాయని టీడీపీ నాయకుడు ఎంవీవీ ప్రసాద్ పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో సోమవారం మహిళలకు ముగ్గులు, యువతకు డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మండల వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి మహిళలు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. మహిళలు వేసిన ముగ్గులు అబ్బురపరిచాయి. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ యువతలో నైపుణ్యతను వెలికితీసి, వారికి తగిన గుర్తింపు తెచ్చేందుకు పోటీలు నిర్వహించడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సంహాచలం, ఎంపీటీసీ సభ్యురాలు అంబటి నూకాలమ్మ, నాయకులు బఖీర్‌ఖాన్, మిరియాల రాజు, పీటా ఆదిలక్ష్మి, అనిశెట్టి చిరంజీవి, ముప్పవరపు శివాజీ పాల్గొన్నారు.

ఉద్యోగులపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం

కాంట్రాక్టు, ఔటసోర్సింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారంలో విఫలం

టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్



సమ్మె శిబిరం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

పాడేరు రూరల్, జనవరి 1: రాష్ట్రాన్ని పాలిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల ఏమాత్ర చిత్తశుద్ధి లేదని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. సమస్యలు పరిష్కారం కోరుతూ ఐటీడీఏ కార్యాలయం ఎదుట 13 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష (ఎస్ఎస్ఏ) కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల శిబిరాన్ని సోమవారం సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి సంపూర్ణ మద్దతు తెలిపి శిబిరంలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సరికదా ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెను నీరుగార్చేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. అందుకే సమ్మె చేస్తున్న ఉద్యోగులకు విద్యా శాధికారుల ద్వారా షోకాజ్ నోటీసులు జారీచేసి భయపెట్టే ప్రయత్నం చేశారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు కుడుముల కాంతారావు, కొర్రా మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని, హామీలను నెరవేర్చాలనే న్యాయమైన డిమాండ్లతో మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతూ ఎన్ని వినతులు అందించినా సమస్యలు పరిష్కరించకపోవడంతోనే సమ్మె బాట పట్టాల్సి వచ్చిందన్నారు. సమ్మెను విరమించేవరకు ఉద్యోగులకు తమ మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాకూరు వెంకటరమణరాజు, టి.సుబ్బారావు, కె.ధన్నేరావు, పి.శాస్త్రిబాబు, కె.సాయిరాం, ఎస్.వెంకటేష్, ఎస్.కాంతమ్మ, రమ, ఎస్.సత్యవతి, ఎల్‌బీ.కళావతి, ఏపీటీఎఫ్ నాయకులు బి.చిన్నారావు, ఎం.సత్యారావు, కె.దేముళ్లునాయుడు, టీఎంపీ.హేమలత, బి.సన్యాసమ్మ, కన్నారావు, ప్రభాకర్, మత్స్యరాజు, ఎస్ఎస్ఏ ఉద్యోగ సంఘ నాయకులు వి.జయరాజు, ఎం.అనీల్‌కుమార్, పి.సింహాచలం, గౌరీశంకర్, వెంకటరమణ దొర, సుభద్ర, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ కుటుంబాలకు అండగా కేంద్రం

» బీజేపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బిసాయి ధర్మరాజు



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

డుంబ్రిగుడ, జనవరి 1: ఆదివాసీల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని బీజేపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బిసాయి ధర్మరాజు అన్నారు. మండలంలోని పోతంగి పంచాయతీలో ఎంపీడీవో ఉషారాణి సమక్షంలో సోమవారం కేంద్ర పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు వెనుకబాటుకు గురికాకుండా ప్రత్యేక ప్రణాళికతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. ఇందులో భాగంగా ఆదివాసీలు స్వయం ఉపాధికి ఊతమిచ్చుకోవాలనే ఉద్దేశంతో వన్‌ధన్ వికాస కేంద్రాల స్థాపనకు చర్యలు తీసుకుందన్నారు. జన్‌మన్ నిధితో కోటి ఆదివాసీ కుటటుంబాలకు అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బ్యాంకుల ద్వారా రుణాల కల్పనకు చర్యలు చేపటిందన్నారు. ఈ అవకాశాలను ఆదివాసీ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి అంబిక, సర్పంచ్ వెంకటరావు, బీజేపీ నాయకులు మూర్తి, జగన్నాథం, సచివాలయ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.





పాడేరు సమ్మె శిబిరంలో ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు... కొయ్యూరులో కబడ్డీ ఆడుతూ నిరసన తెలుపుతున్న దృశ్యం

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



చింతపల్లిలో అంగన్‌వాడీలకు మద్దతుగా గిరిజన సంఘం నేతల నినాదాలు

పాడేరు రూరల్/కొయ్యూరు/చింతపల్లి/ముంచంగిపుట్టు/జి.మాడుగుల, జనవరి 1: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సోమవారం నాటికి సమ్మె 21వ రోజుకు చేరింది. మన్యంలో పాడేరు, కొయ్యూరు, చింతపల్లి, ముంచంగిపుట్టు, జి.మాడుగుల తదితర మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాడేరు శిబిరంలోనే నూతన సంవత్సర వేడుకలను నిర్వహించి చిన్నారులకు కేక్‌ను పంచిపెట్టారు. ఇక్కడ సమ్మెకు టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మీ, చిన్నారి, ఇందిర, జయ, విజయ, లక్ష్మి, కొండమ్మ, సత్యవతి పాల్గొన్నారు. అలాగే కొయ్యూరులో అంగన్‌వాడీ యూనియన్ నేతలు ముత్యాలమ్మ, దేముడమ్మ తదితరులు ప్రభుత్వ మొండివైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ సమ్మె శిబిరంలోనే కబడ్డీ ఆడుతూ విన్నూతనంగా అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.అప్పలనాయుడు, ఎస్.సూరిబాబు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ముంచంగిపుట్టు దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ధింసా నృత్యంతో పాటు ఆటపాటలతో నిరసనను తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ, గిరిజన సంఘం, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.త్రినాథ్, పి.భీమరాజు, ఎం.ఎం.శ్రీను, బి.సత్యవతి, డి.సుజాత, మౌకమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు. చింతపల్లి గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొడు గంగరాజు, డి.శశికుమార్, జి.మోహన్‌రావు, కామేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ నేతలు పెంటమ్మ, రాములమ్మ, అక్కమ్మ, నీలమ్మ, కుమారి పాల్గొన్నారు. అలాగే జి.మాడగులలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మనపడాల్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, శ్రీనుబాబు, మోద కొండమ్మ, వరహాలమ్మ, అన్నపూర్ణ, రాజేశ్వరి, కాంతమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో భజన కీర్తనలు నిర్వహించాలి

కొయ్యూరు, జనవరి 1: అయోధ్యలో ఈ నెల 22న జరిగే బలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామాల్లోని ఆలయాలలో భజన కీర్తన నిర్వహించాలని వీహెచ్‌పీ ధర్మ రక్షకులు ఈరే మల్లిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో సోమవారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రామ నామ జపం చేయాలని క ఓరారు. కార్యక్రమంలో సర్పంచ్ పీటా సింహాచలం, ఎంపీటీసీ సభ్యురాలు అంబటి నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రపాలెంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అక్షింతలతో భక్తుల ర్యాలీ

సంక్షిప్తంగా..

పంచాయతీరాజ్ రెగ్యులర్ ఈఈగా కొండయ్యపడాల్

» డిప్యూటీ ఈఈగా ఉంటూ ఏడాదిగా ఈఈగా అదనపు బాధ్యతల నిర్వహణ

» తాజాగా పదోన్నతితో ఈఈగా నియామకం



ఈఈ కొండయ్యపడాల్

పాడేరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ రెగ్యులర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా తమర్బ కొండయ్య పడాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడాదిగా స్థానిక పీఆర్ ఈఈ పోస్టు ఖాళీగా ఉండడంతో డిప్యూటీ ఈఈగా పని చేస్తున్న టి.కొండయ్యపడాల్‌కు ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. దీంతో ఏడాదిగా ఆయనే ఈఈగా ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ క్రమంలో ఆయనకు తాజాగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తమర్బ కొండయ్యపడాల్ రెగ్యులర్ ఈఈగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. గిరిజన ప్రాంతంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని ఈఈగా బాధ్యతలు స్వీకరించిన కొండయ్యపడాల్ పేర్కొన్నారు.

మాట నిలబెట్టుకున్న నేత జగన్: ఎమ్మెల్యే

పాడేరు రూరల్, జనవరి 1: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ అమలుచేసి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మీ అన్నారు. జనవరి నుంచి రూ.3 వేల పింఛన్ అమలు కార్యక్రమాన్ని కాడెలి పంచాయతీ చావిడిమామిడి గ్రామంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం జగన్‌ను గెలిపించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనుగు బసవన్నదొర, ట్రైకార్ చైర్మన్ సతకా బుల్లిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, నాయకులు పి.సత్యనారాయణ, దశమూర్తి, కె.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మోదకొండమ్మ ఆలయం



మోదకొండమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

పాడేరు రూరల్, జనవరి 1: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వందలాది మంది భక్తులు సోమవారం ఉదయం నుంచి మోదకొండమ్మ, ఉమానీలకంఠేశ్వర, సాయిబాబా, కనకదుర్గమ్మ ఆలయాలకు క్యూ కట్టారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. మోదకొండమ్మ ఆలయంలో సబ్ కలెక్టర్ కార్తీక్ తల్లిదండ్రులతో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. మోదకొండమ్మ ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ప్రసాద కమిటీ ప్రతినిధులు కొట్టగుళ్లి రామారావు, పోతురాజు, ముకుందరావు, శ్రీనివాస్‌కుమార్, కొండలరావు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కూడా భాస్కరరావు, వీఆర్వో జె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

22 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

పాడేరు రూరల్, జనవరి 1: మద్యం తాగి వాహనాలను నడిపిన 22 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరు పీఎంఆర్సీ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి 10.30 గంటల నుంచి 1.30 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందిపై కేసులు నమోదు చేసి, వారి వాహనాలను సీజ్ చేశామని ఆయన తెలిపారు. వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు ఇకపై ఆకస్మికంగా తనిఖీలను చేపడతామన్నారు.

నేడు తారుమారు సంత



తారుమారు సంతకు షెడ్లు వేస్తున్న నిర్వాహకులు

జి.మాడుగుల, జనవరి 1: మండల కేంద్రంలో మంగళవారం తారుమారు సంత జరగనున్నది. ఈ సంత నిర్వహణ కోసం విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. స్థానిక వెంకటరాజు ఘాట్ స్థలం వద్ద ప్రతీ ఏటా అనవాయితీగా నిర్వహించే ఈ సంతకు విశేష స్పందన వస్తోంది. కాగా, ఈ ఏడాది వరుసగా రెండు మంగళవారాలు తారుమారు సంత నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ముమ్మర ఏర్పాట్లు చేశామని సర్పంచ్ కిముడు రాంబాబు తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



హరిమూర్తి (ఫైల్)

కొయ్యూరు, జనవరి 1: మంప మాజీ సర్పంచ్, టీడీపీ నేత ఇంగువ హరిమూర్తిపడాల్ (68) గుండెపోటుతో మృతి చెందారు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్న పడాల్ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో గుండెలో మంట వస్తున్నట్టు కుటుంబీకులకు తెలపడంతో హుటాహుటిన రాజేంద్రపాలెం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందిన అనంతరం ఇంటికి వెళ్లి సేదతీరుతూ మరణించారు. నాలుగు పర్యాయాలు మంప సర్పంచ్‌గా కొనసాగారు. ప్రస్తుతం ఆయన సోదరుడు త్రినాథపడాల్ గత ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగారు. అతని మరణ వార్తతో మంపలో విషాద ఛాయలు అలముకున్నాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ డి.చిట్టిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శివరామరాజుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పడాల్‌కు నివాళులు అర్పించారు.